# శర్వాణి విద్యాలయంలో ఆధ్యాత్మిక శోభ..

## ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

కృష్ణుడి వేషధారణలతో అలరించిన చిన్నారులు
పాటలు, నృత్యాలతో ఆకట్టుకున్న విద్యార్థులు
భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఉట్టి ఉత్సవం
కృష్ణతత్వం.. ధర్మ విజయాన్ని వివరించిన వక్తలు

(మిగతా 2వ పేజీలో)



RNI NO: APTEL/2014/5832

# నవతరం

తెలుగు దిన పత్రిక

ఎడిషన్ ఇంచార్జ్: నవచైతన్య శిరిగిరి

సంపుటి: 13, సంచిక: 253, 04-09-2026 శుక్రవారం వెల:1/- పేజీలు: 4

శ్రీకాకుళం - విజయనగరం - విశాఖపట్నం - రాజమండ్రి

నవతరం ప్రతినిధి శ్రీకాకుళం

# ఎంపీ నిధుల ఖర్చు చేయలేరా... ప్రజలకు సమాధానం చెప్పరా?



**ప్రజల** అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంలో తెలుగు రాష్ట్రాల ఎంపీలు తీవ్రంగా విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గాల్లో రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్య, వైద్యం వంటి కనీస వసతుల కోసం ప్రజలు ఏళ్ల తరబడి ఎదురుచూస్తుంటే.. వారి సమస్యలను పరిష్కరించేందుకు అందుబాటులో ఉన్న నిధులను సైతం ఎంపీలు పూర్తిస్థాయిలో వినియోగించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలు ఎంపీల పనితీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. 2024 మేలో రెండోసారి మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఎంపీలకు రూ.11,681 కోట్ల నిధులు విడుదల కాగా.. కేవలం రూ.3,964 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అంటే మొత్తం నిధుల్లో 33.9 శాతం మాత్రమే వినియోగించారు.

### ప్రజల సమస్యలు కనిపించవా?

నిధులు ఉన్నప్పటికీ వాటిని సద్వినియోగం చేయకపోవడంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉండటం, తాగునీటి సమస్యలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఆసుపత్రుల్లో సౌకర్యాల లేమి వంటి సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇలాంటి సమయంలో నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కేటాయించిన నిధులను కూడా ఖర్చు చేయకపోతే.. ఎంపీలు ప్రజలకు ఏం సమాధానం చెబుతారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.దేశవ్యాప్తంగా అత్యధికంగా నిధులు వినియోగించిన రాష్ట్రాలతో పోలిస్తే తెలుగు రాష్ట్రాల ఎంపీల పనితీరు మరింత నిరాశాజనకంగా కనిపిస్తోంది. నాగాలాండ్ ఎంపీలు తమకు లభించిన నిధుల్లో 94.6 శాతం వినియోగించగా, తెలుగు రాష్ట్రాల్లో మాత్రం పావు వంతు కూడా ఖర్చు చేయకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.ప్రజలు ఓట్లు వేసి ఎంపీలను గెలిపించించారు.... ఢిల్లీలో కూర్చుని రాజకీయాలు చేయడానికి మాత్రమే కాదు.. తమ నియోజకవర్గాలను అభివృద్ధి చేయడానికీ. అభివృద్ధి పనులకు నిధులు అందుబాటులో ఉన్నా వాటిని వినియోగించకుండా నిర్లక్ష్యం చేస్తే.. ప్రజల విశ్వాసాన్ని ఎలా నిలబెట్టుకుంటారన్న ప్రశ్నకు ఎంపీలు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.నిధులు ఖర్చు కాకపోవడం కేవలం గణాంకాల అంశం కాదు.. ఇది ప్రజల అభివృద్ధి హక్కుతో ముడిపడిన విషయం. ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై పారదర్శకత పెంచడంతో పాటు, కేటాయించిన నిధులను సకాలంలో ప్రజా అవసరాలకు ఖర్చు చేసేలా ఎంపీలపై బాధ్యత, జవాబుదారీతనం పెంచాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### తెలుగు రాష్ట్రాల ఎంపీలపై తీవ్ర విమర్శలు..
### రూ.948 కోట్లలో ఖర్చయింది రూ.221 కోట్లే!

### అభివృద్ధి కోసం వచ్చిన నిధులు మూలుగుతుంటే..
### ప్రజా సమస్యలు మాత్రం గాలికి?

#### తెలుగు రాష్ట్రాల్లో మరింత దారుణం!

తెలంగాణలో ఎంపీలకు రూ.394 కోట్లు కేటాయించగా.. కేవలం రూ.94 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అంటే 23.8 శాతం నిధులే వినియోగించారు. దాదాపు 76 శాతం నిధులు ఖర్చు కాకుండా మిగిలిపోయాయి.
ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి కూడా ఏమాత్రం భిన్నంగా లేదు. ఏపీ ఎంపీలకు రూ.554 కోట్లు కేటాయించగా.. కేవలం రూ.127 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అంటే 23 శాతం నిధులే వినియోగించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మిగిలిన సుమారు 77 శాతం నిధులు ఖర్చు కాకుండా ఉండిపోయాయి.









# ఐతం అధ్యాపకురాలికి డాక్టరేట్!

**ఫజీ వాతావరణంలో అత్యుత్తమీకరణ నమూనాలపై పరిశోధన**
**జ్యోతి విద్యాపీఠ్ మహిళా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా**
**బోధనతోపాటు పరిశోధనలోనూ రాణించిన లక్ష్మి కాకర్లపూడి**
**అధ్యాపకురాలిని అభినందించిన ఐతం కళాశాల యాజమాన్యం**

**నవతరం, టెక్కలి** టెక్కలి సమీపంలోని ఐతం ఇంజనీరింగ్ కళాశాల బేసిక్ సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగం అధ్యాపకురాలు లక్ష్మి కాకర్లపూడి డాక్టరేట్ పట్టా సాధించారు. జైపూర్‌లోని జ్యోతి విద్యాపీఠ్ మహిళా విశ్వవిద్యాలయంలో "ఎ స్టడీ ఆఫ్ సర్టెన్ ఆప్టిమైజేషన్ మోడల్స్ ఇన్ ది ఫజీ ఎన్విరాన్‌మెంట్" అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేశారు.'ఫజీ వాతావరణంలో కొన్ని నిర్దిష్ట **(మిగతా 2వ పేజీలో)**

# జిల్లాలో పంచాయతీ సమస్యలపై సత్వర చర్యలు చేపట్టాలి

## జిల్లా పరిషత్ అధ్యక్షులు పిరియా విజయ

**శ్రీకాకుళం,సెప్టెంబర్,3:** జిల్లాలో ఉన్న పంచాయతీల్లో ఉన్న సమస్యలపై గ్రామ సభలు నిర్వహించి సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ అధ్యక్షులు పిరియా విజయ డి పి ఓ ని ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 1,2,4,7వ స్థాయి సంఘ సమావేశాలను ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా పంచాయతీ రాజ్ పనులపై సభ్యులు చర్చించారు. జిల్లా పంచాయతీ అధికారి స్వరూపరాణి జిల్లా పంచాయతీల ద్వారా చేపడుతున్న పనులను వివరించారు. పోలాకి మండలంలో పంచాయతీ పనుల పై ఆ మండల జడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య సభ దృష్టికి తీసుకు రాగా డిపిఓ మాట్లాడుతూ పనులు

(మిగతా 2వ పేజీలో)




# దూకుడు పెంచిన వైసీపీ

**నూతనంగా జిల్లా పార్టీ కార్యాలయం**
**సర్కార్ తీరును ఎండగట్టుటే వైకాపా లక్ష్యమా?**

**శ్రీకాకుళం:** కూటమి సర్కార్ తీరును, ప్రజలకు చేస్తున్న అన్యాయాన్ని వారి వద్దకే తీసుకువెల్లేందుకు వైకాపా సిద్ధమైనట్లు కనిపిస్తోంది. స్థానిక ఎన్నికలు త్వరలో జరగబోవు నేపథ్యంలో వైకాపా దూకుడు పెంచింది. శ్రీకాకుళం జిల్లా కేంద్రంగా స్థానిక టౌన్ హాల్‌లో జిల్లా పార్టీ కార్యాలయాన్ని ఆగస్టు నెలాఖరులో ప్రారంబించారు.అదే వేదిక పై మాజీ మంత్రి ధర్మాన మాట్లాడుతూ కూటమి సర్కార్ తీరును ఎండగట్టారు. ప్రభుత్వం పై ప్రజా వ్యతిరేకత పెరిగినప్పుడే ప్రతిపక్ష నాయకులను టార్గెట్ చేస్తూ అక్రమ కేసులను బనాయిస్తారని, తనపై కూడా కాలనీ ప్రారంబించినట్లు కేసు కట్టారని, తాను కేవలం గృహ ప్రవేశానికి వెల్లాలని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇలాంటి కేసులు సహజమని కేసులతో భయపడేది లేదన్నారు... కూటమి సర్కార్ తప్పులపై తప్పులు చేస్తుందని, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, చింతాడ రవికుమార్‌లును అక్రమంగా అరెస్టులు చేయించారని ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు.. ఈ నేపథ్యంలో మాజీ సీఎం జగన్ కూడా పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తానని గట్టిగా సందేశం ఇచ్చారు.గతంలో ఉన్నట్లు ఇప్పుడు ఉండదని, కార్యకర్తలు, నాయకులు సంక్షేమం చూస్తానని చెప్పారు. మళ్లీ ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ చోట వైకాపా పోటీ చేయాల్సిందేనని, గట్టిగా చెప్పారు. ఏ నియోజకవర్గంలోనైనా పోటీ లేకుండా అక్కడ ఎమ్మెల్యే అభ్యర్థి పోటీ చేయనవరసరం లేదన్నారు. అలాగే ధర్మాన కృష్ణ చైతన్య కూడా దూకుడు ప్రారంబించారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు తండ్రి అధికారంను అడ్డుపెట్టుకొని ఎన్నో పనులు చేశాడని కృష్ణదాస్‌కుమారుడుపై ఆరోపణలు ఉన్నప్పటికీ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కారణంతో ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలాకి మండలం సర్వ సభ్య సమావేశంలో పాలకులు, నాయకులు తీరును కృష్ణ చైతన్య నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. అధికారులు వచ్చి తప్పకుండా న్యాయం జరుగుతోందని చెబితే ధర్నాను ఆయన విరమించుకున్నారు. ఈ రోజు జిల్లా పరిషత్‌లో జరిగిన సమావేశంలో కూడా ఏకంగా

**(మిగతా 2వ పేజీలో)**

నవతరం
తెలుగు దిన పత్రిక

# దూకుడు పెంచిన వైసీపీ

(మొదటిపేజీ తరువాయి)

కూన రవికుమార్‌తోనే వాగ్వివాదానికి దిగారు..జిల్లాలో పలాసలో ప్రతిపక్షం బలంగా ఉంది. సీదిరి అప్పలరాజు నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు ఎదురైనా ప్రశ్నిస్తున్నారు.అలాగే శ్రీకాకుళంలో కూడా వైసీపీ కార్యక్రమాలు జోరందుకున్నాయి. ధర్మాన ప్రసాదరావు వ్యూహాలతో అధికార పార్టీ నేతలకు ఇప్పటికే చెమటలు పట్టిస్తుండగా, ధర్మాన కృష్ణదాస్ కూడా జిల్లా అధ్యక్షుడు హోదాలో కార్యక్రమాలును జోరుగా నడిపిస్తున్నారు.అలాగే ఆమదాలవలసలో వైసీపీ స్పీడ్ పెరిగింది..ఇంకా మిగతా నియోజకవర్గాల్లో జోరు పెరగాల్సిన అవసరం ఉంది.ఎచ్చెర్ల లో కూడా అక్కడ నాయకులు హుషారుగా కార్యక్రమాలను నడిపిస్తూ ప్రజల్లో కి వెలుతున్నారు. పాతపట్నం లో అక్కడ మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఏలాంటి కార్యక్రమాలు చేసినప్పటికీ జిల్లా కేంద్రానికి సమాచార రూపంలో చేరుకోవడం లేదు కనీసం అక్కడైనా ప్రజల్లో వీరు చేస్తున్న కార్యక్రమాలు వెళ్తున్నాయో లేవో తెలియాల్సి ఉంది. ఏది ఏమైనప్పటికీ త్వరలో రానున్న ఎన్నికలకు తాము సిద్ధం అయ్యామంటూ వైకాపా గట్టి సందేశమే కూటమి నాయకులకు పంపింది....

# ఐతం అధ్యాపకురాలికి డాక్టరేట్!

(మొదటిపేజీ తరువాయి)

అత్యుత్తమీకరణ నమూనాలపై అధ్యయనం' అనే అంశంపై లక్ష్మి కాకర్లపూడి పరిశోధన నిర్వహించారు. భారతదేశంలో తొలి రాష్ట్ర ప్రైవేటు మహిళా విశ్వవిద్యాలయంగా జ్యోతి విద్యాపీఠ్ మహిళా విశ్వవిద్యాలయం ఏర్పడినట్లు ఆ సంస్థ అధికారికంగా పేర్కొంది.ఈ సందర్భంగా ఐతం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బోధనతోపాటు పరిశోధనలోనూ రాణించి డాక్టరేట్ సాధించడం అభినందనీయమన్నారు. అధ్యాపకులు బోధనకు మాత్రమే పరిమితం కాకుండా పరిశోధనలకు కూడా ప్రాధాన్యమిస్తూ నూతన విజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు.డాక్టరేట్ సాధించిన లక్ష్మి కాకర్లపూడిని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్. శ్రీనివాసరావు, సీఏఓ ఎన్.ఎ. నరసింహరాజు, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది అభినందించారు.

# జిల్లాలో పంచాయతీ సమస్యలపై సత్వర చర్యలు చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో పంచాయతీల పై ఉన్న పనులపై సత్వర చర్యలు చేపట్టాలని జడ్పీ ఛైర్మన్ పిరియా విజయ చెప్పారు. శాసన సభ్యులు కూన రవి కుమార్ మాట్లాడుతూ పంచాయతీల్లో ఉన్న పనులపై గ్రామ సభలు నిర్వహించి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పరిషత్ నిధిలన్నీ వినియోగపడే విధంగా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. అనంతరం డ్వామా పిడి లవరాజు వివిజి రాంజి పథకం ద్వారా జిల్లాలో అమలు చేస్తున్న పనులపై సభకు వివరించారు. ఆమదాలవలస శాసన సభ్యులు కూన రవి కుమార్ మెటీరియల్ కాంపొనెంట్స్ కు సంబంధించి వివరాలను పిడిని అడిగి తెలుసుకున్నారు.

ఎపిఈపిడిసిఎల్ ఎస్ఈ జిల్లాలో చేపడుతున్న పనులను సభ్యులకు తెలుపగా మండలాల్లో లో ఓల్టేజీ సమస్య ఉందని సంతబొమ్మాళి, టెక్కలి మండలం జడ్పీ సభ్యులు ఎస్ఈ దృష్టికి తీసుకురాగా జిల్లాలో 720 ట్రాన్స్ ఫార్మర్స్ ఏర్పాటు చేయాల్సి ఉందని, ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేస్తే లో ఓల్టేజీ సమస్య తీరుతుందని ఎస్ఈ సభ్యులకు వివరించారు. విద్యుత్ శాఖలో కింది స్థాయి అధికారులు పనిచేయాలని శాసన సభ్యులు కూన రవి కుమార్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సిఈఓ వెంకటరామన్, ఆయా స్థాయి సంఘాలకు సంబంధించి సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శర్వాణి విద్యాలయంలో ఆధ్యాత్మిక శోభ.. ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



(మొదటిపేజీ తరువాయి)

నవతరం, శ్రీకాకుళం, సెప్టెంబర్ 3: స్థానిక అరసవల్లి రోడ్డులోని శర్వాణి విద్యాలయంలో ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకులు అంధవరపు సూరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో సందడి చేశారు. పాటలు, నృత్యాలతో అలరించి అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం సంప్రదాయబద్ధంగా ఉట్టి ఉత్సవాన్ని నిర్వహించి, విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ.. శ్రీ మహావిష్ణువు దశావతారాల్లో అష్టమ అవతారమైన శ్రీకృష్ణుడు భగవద్గీతను అందించి ప్రపంచానికే జగద్గురువుగా నిలిచారని అన్నారు. భగవద్గీతను అవగాహన చేసుకోవడం ద్వారా మనల్ని మనం సంస్కరించుకోవడంతో పాటు సమాజానికి, ప్రపంచానికి దిశానిర్దేశం చేసే సామర్థ్యాన్ని పొందవచ్చున్నారు.దుష్టశిక్షణ, శిష్టరక్షణ ద్వారా మనిషి ఎలా జీవించాలో శ్రీకృష్ణుడి అవతారం తెలియజేస్తుందని పేర్కొన్నారు. కురుక్షేత్ర మహాసంగ్రామంలో ధర్మం వైపు నిలిచి ధర్మాన్ని గెలిపించిన శ్రీకృష్ణుడు.. ఎన్నటికీ అధర్మంపై ధర్మమే విజయం సాధిస్తుందనే శాశ్వత సందేశాన్ని ప్రపంచానికి అందించారని వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎ. ఆంజనేయులు మాట్లాడుతూ.. శ్రీకృష్ణ భగవానుడు భారతదేశానికే కాకుండా యావత్ ప్రపంచానికి మార్గనిర్దేశం చేశారని అన్నారు. అందుకే ఆయనను 'కృష్ణం వందే జగద్గురుం' అంటూ ప్రపంచం కీర్తిస్తోందన్నారు. శ్రీకృష్ణుడు--సుదాముల స్నేహం ఆదర్శ స్నేహానికి నిదర్శనమని పేర్కొన్నారు.దైవాంశ సంభూతుడైనప్పటికీ మానవ జన్మమెత్తిన ప్రతి ఒక్కరికీ గురువు అవసరమనే సందేశాన్ని శ్రీకృష్ణుడి జీవితం తెలియజేస్తుందన్నారు. శ్రీకృష్ణుడు సాందీపుని వద్ద విద్యను అభ్యసించి, సముద్రంలో కోల్పోయిన గురుపుత్రుడిని గురుదక్షిణగా తీసుకువచ్చి గురుభక్తిని చాటారని గుర్తుచేశారు. ప్రతి విద్యార్థి శ్రీకృష్ణుడిని ఆదర్శంగా తీసుకుని గురువుల వద్ద క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ, స్నేహధర్మాన్ని పాటించి ఉన్నత విలువలతో ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సంకిలి సుగర్ ఫ్యాక్టరీకి అండగా.. ప్రజాప్రతినిధుల హామీ

**ఫ్యాక్టరీ మనుగడకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం అవసరం**

**చెరకు రైతుల సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన పరిరక్షణ సమితి**

**రైతులు, యాజమాన్యంతో కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా**

**ఐడీ ప్యారీ సంస్థ చైర్మన్‌తో రైతులతో కలిసి చర్చించేందుకు సన్నాహాలు**

**నవతరం, శ్రీకాకుళం:** ఉత్తరాంధ్రలోని సంకిలి గ్రామంలో ఉన్న ఏకైక సుగర్ ఫ్యాక్టరీని కాపాడుకునేందుకు అందరం కలిసికట్టుగా పనిచేయాలని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. ఫ్యాక్టరీ మనుగడకు అవసరమైన సహాయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోనే ఉందని, సమస్య పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు.సంకిలి సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ సమితి, చెరకు రైతుల సమస్యలను ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకెళ్లింది. జిల్లా పరిషత్ సమావేశ మందిరం వద్ద ఆయనను కలిసి ఫ్యాక్టరీ పరిస్థితి, చెరకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కూన రవికుమార్ హామీ ఇచ్చారు. అనంతరం 80 అడుగుల రోడ్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కలిసి సమస్యను వివరించారు.అదేవిధంగా మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, ధర్మాన ప్రసాదరావులను వారి జిల్లా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌బాబుతో కలిసి పరిరక్షణ సమితి ప్రతినిధులు కలిశారు. సంకిలి సుగర్ ఫ్యాక్టరీ పరిస్థితి, యాజమాన్యం ప్రకటించిన అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. రైతులు, యాజమాన్యం కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని వారు సూచించారు. తమిళనాడులో ఉన్న ఐడీ ప్యారీ సంస్థ చైర్మన్‌ను రైతులతో కలిసి వెళ్లి కలసి చర్చిస్తామని, సంకిలి సుగర్ ఫ్యాక్టరీ మనుగడను కాపాడేందుకు తమ వంతు కృషి చేస్తామని మాజీ మంత్రులు హామీ ఇచ్చారు.

ఫ్యాక్టరీతో చెరకు రైతుల జీవనోపాధి ముడిపడి ఉన్నందున దాని పరిరక్షణకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పరిరక్షణ సమితి ప్రతినిధులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చెరకు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, సంకిలి సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ సమితి సభ్యులు నిష్టల సూర్యప్రకాష్ భుక్త, కింజరాపు సురేష్, చింత సంగం నాయుడు, కరణం శ్రీనివాసరావు, కర్రి రమణ, మజ్జి దుర్గారావు, జడ్డు నాగరాజు, కురిటి పాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.



# ఆపదలో అండగా.. వృద్ధురాలికి ధర్మాన రామ్ మనోహర్ నాయుడు పరామర్శ

**లెన్స్ ఆపరేషన్ చేయించుకున్న పొట్నూరు గడ్డిమ్మకు పరామర్శ**

**ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న యువనేత**

**త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ధర్మాన రామ్ మనోహర్ నాయుడు**

**కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక యువత, నాయకులు**



**నవతరం, శ్రీకాకుళం రూరల్ :** రాగోలు పంచాయతీ పరిధిలోని రాగోలు పేట గ్రామానికి చెందిన పొట్నూరు శ్రీనివాసరావు తల్లి పొట్నూరు గడ్డిమ్మకు ఇటీవల లెన్స్ ఆపరేషన్ జరిగింది. విషయం తెలుసుకున్న యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు గురువారం సాయంత్రం ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి, గడ్డిమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.
ఆపద సమయంలో అండగా నిలవడం, వృద్ధులకు భరోసా కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ధర్మాన రామ్ మనోహర్ నాయుడు అన్నారు. గడ్డిమ్మ ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులతో మాట్లాడి, అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ముచ్చ జగదీష్, బంటుపల్లి శ్రీరాములు, పొట్నూరు దాలయ్య, బంటుపల్లి వెంకటరమణ, పొట్నూరు మోకలింగం, పలాస రమేష్‌తో పాటు పలువురు స్థానిక యువత, నాయకులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధిత మత్స్యకారుడికి ఎమ్మెల్సీ నర్తు రామారావు అండ

## రూ.25 లక్షల ఆస్తి నష్టం.. రూ.10 వేల సొంత నిధులతో తక్షణ సాయం
## కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ

కవిటి: ఇచ్ఛాపురం నియోజకవర్గం కవిటి మండలం కాపాసుకుద్ది గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు రూ.25 లక్షల విలువైన ఆస్తిని కోల్పోయిన మత్స్యకారుడు గీత తోటయ్య కుటుంబాన్ని గౌరవ ఎమ్మెల్సీ నర్తు రామారావు పరామర్శించారు.
షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ ప్రమాదంలో తోటయ్య చేపల వ్యాపారం కోసం వినియోగించే సుమారు 25 ఐస్ బాక్సులు, ఫ్రిడ్జ్, వివిధ రకాల వలలు, ఇతర మత్స్యకార సామగ్రి పూర్తిగా దగ్ధమై బూడిదపాలయ్యాయి. ప్రమాదం జరిగి సుమారు 20 రోజులు గడుస్తున్నా బాధిత కుటుంబాన్ని అధికార పార్టీ ఎమ్మెల్యే కనీసం పరామర్శించకపోవడం పట్ల స్థానిక మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు.
విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్‌తో కలిసి కాపాసుకుద్ది గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుడికి ధైర్యం





చెప్పి, అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. తన సొంత నిధుల నుంచి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. బాధిత కుటుంబానికి జరిగిన నష్టాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం నుంచి తగిన నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్సీ నర్తు రామారావు హామీ ఇచ్చారు. సుమారు రూ.25 లక్షల విలువైన ఆస్తిని కోల్పోయిన మత్స్యకార కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.
ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారం ప్రకటించకపోతే మత్స్యకారుల తరఫున పోరాటం చేపట్టి ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెబుతామని ఎమ్మెల్సీ నర్తు రామారావు స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్, లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి పులకల శ్రీరాములు, స్థానిక సర్పంచ్ దమయంతి భీమ్సేన్, గ్రామ పెద్ద బడే రామారావు, మైలపిల్లి దాసు, వెంకట్రావు, తోట రామారావు, యువజన సంఘ సభ్యులు, మత్స్యకారులు, మహిళలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవ అనుమతులు ఆన్‌లైన్‌లో ఉచితం

## కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నవతరం శ్రీకాకుళం, సెప్టెంబర్ 3: జిల్లా వ్యాప్తంగా గణేష్ ఉత్సవ మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా 'సింగిల్ విండో' విధానంలో రూపాయి కూడా రుసుము చెల్లించకుండా ఉచితంగా అనుమతులు మంజూరు చేస్తున్నామని, దరఖాస్తు చేసుకోగానే అధికారులే నేరుగా వచ్చి పరిశీలిస్తారని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి ,జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలిసి నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 14 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు తగినంత ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనుమతుల విధానంపై శుక్రవారం డివిజన్, ఆ మరుసటి రోజు మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. పర్యావరణహిత మండపాలను ప్రోత్సహించేందుకు జిల్లా స్థాయిలో కమిటీ సభ్యులు ప్రజలను చైతన్యవంతలను చేయాలని కోరారు. అన్నదానాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని లేకుండా చూడాలని,బీఐఎస్ లేదా ఐఎస్ఐ ప్రమాణాలున్న విద్యుత్ పరికరాలనే మండపాలలో వాడాలని, భారీ విగ్రహాలకు సంబంధించి మండపాల వద్ద ఇంజినీరింగ్ అధికారుల నుంచి నిర్మాణ దృఢత్వ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అని తేల్చిచెప్పారు.

నిమజ్జన ప్రాంతాల్లో తాగునీరు, వెలుతురు, పారిశుధ్యం, క్రేన్లు అందుబాటులో ఉంచాలని, ఈతగాళ్ల వివరాలను ముందే నమోదు చేసుకుని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

పోలీస్ శాఖ 'గణేష్ ఉత్సవ్ 2026' పోర్టల్ ( https://ganeshutsav.net) ద్వారా దరఖాస్తు చేసుకుంటే స్థానిక సంస్థలు, ఇతర శాఖల అధికారులు పరిశీలించి అనుమతులు ఇస్తారని ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఊరేగింపుల్లో అధిక శబ్ద తీవ్రత కలిగిన డీజేలపై వినియోగించరాదని కోరారు, మండపాల వద్ద సీసీటీవీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రమాదకరమైన ప్రవాహం ఉన్న నదులు, కాలువల్లో నిమజ్జనానికి అనుమతి లేదని, తహసిల్దార్లు, పోలీసులు ముందే గుర్తించిన సురక్షిత ప్రాంతాలు, తాత్కాలిక నిమజ్జన గుండాల వద్దనే నిమజ్జనాలు చేయాలని కలెక్టర్, ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, పలాస డీఎస్పీ భవాని, శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్య, విద్యుత్, మున్సిపల్ శాఖల అధికారులు, ఆన్‌లైన్ ద్వారా పలాస టెక్కలి ఆర్డీవోలు కృష్ణమూర్తి అప్పలరాజు, గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు సింతు సుధాకర్, భాస్కరరావు, డాక్టర్ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

# అవినీతిపై ఉక్కుపాదం.. అభివృద్ధిపై దూకుడు

**ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై కఠిన చర్యలు**
**గత పాలనపై బహిరంగ విచారణకు సిద్ధం**
**పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**
**సాగునీరు, తాగునీరు, ఉపాధికి ప్రాధాన్యం**

నవతరం, శ్రీకాకుళం : గత పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై సమగ్ర దర్యాప్తు జరిపి ప్రభుత్వ ఆస్తులను పరిరక్షిస్తామని తెలిపారు. గత పాలనలో జరిగిన అవినీతిపై బహిరంగ విచారణకు, అవసరమైతే లై డిటెక్టర్ పరీక్షకైనా సిద్ధమని సవాల్ విసిరారు.

కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, పింఛన్లు, ఉచిత గ్యాస్, అన్నదాత సుఖీభవ, మత్స్యకారుల భరోసా వంటి పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. వంశధార ఫేజ్-2, లిఫ్ట్ ఇరిగేషన్, రైట్ మెయిన్ కెనాల్ పనులను వేగవంతం చేసి సాగునీరు అందిస్తామని తెలిపారు.శ్రీకాకుళం నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి నూతన బ్రిడ్జి నిర్మాణం, రిమ్స్ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. టైటానియం హబ్, బీచ్ మినరల్ పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు.




# అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి నూతన పాలకమండలి

***12 మందితో పాలకమండలి నియామకం***
***జీఓ ఎంఎస్ నంబర్ 1410 ద్వారా ఉత్తర్వులు***
***సెప్టెంబర్ 5న నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం***
***ఉదయం 10.45 గంటలకు కార్యక్రమం***

నవతరం, అరసవల్లి : ప్రత్యక్షదైవం, ఆరోగ్యప్రదాతగా భక్తుల కొంగుబంగారమైన అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానానికి నూతన పాలకమండలి ఏర్పాటైంది. దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ జీఓ ఎంఎస్ నంబర్ 1410 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. చైర్మన్, ధర్మకర్తమండలి సభ్యులు, ఎక్స్‌ఆఫీషియో సభ్యుడితో కలిపి మొత్తం 12 మందిని పాలకమండలి సభ్యులుగా నియమించారు.నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ నెల 5వ తేదీన ఉదయం 10.45 గంటలకు అరసవల్లి దేవస్థానంలో నిర్వహించనున్నట్లు ఆలయ ఉపకమిషనర్, కార్యనిర్వహణాధికారి కె.ఎన్.వి.డి.వి. ప్రసాద్ తెలిపారు. నూతన పాలకమండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.



# నైరా కళాశాల డీన్‌గా డాక్టర్ డి. చిన్నంనాయుడు

శ్రీకాకుళం రూరల్,సెప్టెంబర్,3 : నైర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా డా. డి. చిన్నంనాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. 1989లో కళాశాల తొలి బ్యాచ్ విద్యార్థిగా వ్యవసాయ విద్యను ఆయన అభ్యసించారు. అనంతరం అదే కళాశాలలో వ్యవసాయ విస్తరణ విభాగంలో ప్రొఫెసర్‌గా సేవలందించారు. అమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లోనూ పనిచేశారు.

పార్వతీపురం మన్యం జిల్లా గవరంపేటకు చెందిన డా. చిన్నంనాయుడు అసోసియేట్ డీన్‌గా బాధ్యతలు చేపట్టడం పట్ల కళాశాల వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను విద్యాభ్యాసం చేసిన కళాశాలలోనే అసోసియేట్ డీన్‌గా బాధ్యతలు స్వీకరించడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు



కళాశాల అభివృద్ధికి అధ్యాపకులు, సిబ్బంది సహకారంతో కృషి చేస్తానన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికతను విద్యార్థులకు చేరువ చేసేందుకు ప్రాధాన్యం ఇస్తానన్నారు.

# సేవా స్ఫూర్తికి సెల్యూట్..

**పురుషోత్తమ నాయుడుకు ఘన జన్మదిన వేడుకలు**

**పేదల సంక్షేమమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు**

**ఆస్ట్రేలియాలో ఉన్నా.. స్వస్థలంలో అభిమానుల సందడి**

**NGGO హోమ్‌లో ఘనంగా జన్మదిన వేడుకలు**

**మనోవికాస కేంద్రానికి 15 రోజుల నిత్యావసర సరుకుల అందజేత**

**ఆయురారోగ్యాలతో మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్ష**

**నవతరం శ్రీకాకుళం**

ప్రజా సేవే పరమావధిగా, పేదలు, నిరుపేదలు, అవసరమైన వారికి అండగా నిలుస్తున్న కామ్రేడ్ చౌదరి పురుషోత్తమ నాయుడు జన్మదిన వేడుకలు శ్రీకాకుళం జిల్లా NGGO హోమ్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. వ్యక్తిగత పర్యటన నిమిత్తం ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్నప్పటికీ, ఆయన పట్ల అభిమానులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, సంఘ నాయకులు చూపిన ఆత్మీయత వేడుకల్లో ప్రతిఫలించింది.జిల్లా జీూజ చైర్మన్, APNGGO సంఘ అధ్యక్షులు కామ్రేడ్ హనుమంతు సాయిరాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఐజమీా చైర్మన్ చౌదరి అవినాష్, ప్రముఖ సామాజిక వేత్త సూర శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పురుషోత్తమ నాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో APNGGO అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ రాయి వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి కామ్రేడ్ చల్లా శ్రీనివాసరావు, సహాధ్యక్షులు కామ్రేడ్ కంట జయరావు, కోశాధికారి కామ్రేడ్ బడగల పూర్ణచంద్రరావు, మహిళా నాయకులు కామ్రేడ్ గోరు హైమావతి, కామ్రేడ్ పైడి శ్రావణి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బొత్స శ్రీనివాసరావు, బారకల నవీన్తో పాటు జిల్లా, పట్టణ సంఘ నాయకులు, వివిధ తాలూకాల అధ్యక్ష, కార్యదర్శులు, పెన్షనర్లు, ఉద్యోగులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



**మనోవికాస కేంద్రానికి చేయూత**

జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా.. పురుషోత్తమ నాయుడు కుటుంబ సభ్యుల సహకారంతో బెహారా మనో వికాస కేంద్రానికి సుమారు 15 రోజుల పాటు అవసరమయ్యే ఆహార పదార్థాలు, నిత్యావసర సరుకులను అందజేశారు. సేవా కార్యక్రమానికి కుటుంబ సభ్యులు ముందుకు రావడంపై పలువురు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పురుషోత్తమ నాయుడు గారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తూ మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజా సేవలో ఆయన మరింత ముందుకు సాగాలని, పేదలు, నిరుపేదలకు అండగా నిలిచే సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు.జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో ముడిపెట్టి నిర్వహించడం ద్వారా పురుషోత్తమ నాయుడు కుటుంబం మరోసారి సేవా స్ఫూర్తిని చాటిందని పలువురు కొనియాడారు.



నవతరం తెలుగు దిన పత్రిక

# “పోరాటమే నివాళి.. ఆశయ సాధనే లక్ష్యం!”

కుమారన్న, సీతారాముల త్యాగాలను కొనసాగించడమే నిజమైన నివాళి

సెప్టెంబరు 10న పెదగంతర్లో 28వ వర్ధంతి కార్యక్రమం

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతిఘటనా పోరాటాలు నిర్మిద్దాం

శ్రీకాకుళ అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం

నూతన ప్రజాస్వామిక విప్లవ సాధనకు ప్రతినబూనాలి: వంకల మాధవరావు



**నవతరం పలాస**

అమరవీరులు కామ్రేడ్ కుమారన్న, కామ్రేడ్ సీతారాములు చూపిన పోరాట మార్గంలో పయనిస్తూ ప్రజా సమస్యలపై సమరశీల ప్రతిఘటనా పోరాటాలను నిర్మించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి వంకల మాధవరావు పిలుపునిచ్చారు. అమర వీరుల ఆశయాలను కొనసాగించడమే వారికి అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. సెప్టెంబరు 10న పలాస మండలం పెదగంతర్లో కామ్రేడ్ కుమారన్న, కామ్రేడ్ సీతారాముల 28వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ ముద్రించిన కరపత్రాన్ని గురువారం బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనం వద్ద పార్టీ, ప్రజా సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వంకల మాధవరావు మాట్లాడుతూ.. దేశంలోని దోపిడీ, పీడన వ్యవస్థలకు వ్యతిరేకంగా నూతన ప్రజాస్వామిక విప్లవ సాధన కోసం వేలాది మంది వీరులు తమ ప్రాణాలను త్యాగం చేశారని పేర్కొన్నారు. ప్రజల కోసం తుది శ్వాస వరకు పోరాడిన అమరవీరులు నెలకొల్పిన విప్లవ సంప్రదాయాలు, విలువలు, త్యాగాలు, నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తినిస్తున్నాయని అన్నారు. అమరవీరులు అనుసరించిన మార్గంలో పయనిస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేసి, తదనంతరం సోషలిస్టు, కమ్యూనిస్టు వ్యవస్థల స్థాపనకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్లో అమరులైన వీరులందరికీ అరుణారుణ జోహార్లు అర్పించాలని, భారత విప్లవోద్యమానికి వేగుచుక్కలుగా నిలిచిన 360 మందికి పైగా శ్రీకాకుళ అమరవీరులను స్మరించుకుంటూ వర్తమాన వ్యవసాయక విప్లవ కర్తవ్యాలను నిర్వహించేందుకు ప్రతిజ్ఞ చేయాలని అన్నారు.

### త్యాగాల బాటలో నడవాలి

కార్యక్రమానికి ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు గొరకల బాలకృష్ణ అధ్యక్షత వహించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నెట్టి రాజశేఖర్ మాట్లాడుతూ సాయుధ పోరాటాల్లో అమరులైన వీరులను స్మరించుకోవడం అంటే వారు ఆశించిన దోపిడీ రహిత ప్రత్యామ్నాయ వ్యవస్థ కోసం కృషి చేయడమేనన్నారు. అమరులు చూపిన త్యాగాల బాటలో నడవడానికి ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వంకల పాపన్న, జిల్లా కార్యదర్శి రాపాక మాధవరావు, ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా కన్వీనర్ సార జగన్, గర్తం కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు.. పెన్షనర్ల డిమాండ్లు పరిష్కరించాలి

**బకాయిలు సత్వరమే చెల్లించాలి..**

**ప్రభుత్వానికి ఏపీ జేఏసీ అమరావతి విజ్ఞప్తి**

**భోజన విరామ సమయంలో జిల్లా సహకార అధికారి కార్యాలయం వద్ద ఉద్యోగుల ఆందోళన**

**నవతరం శ్రీకాకుళం** ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన దీర్ఘకాలిక డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సత్వరమే పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ జేఏసీ అమరావతి ఉద్యోగ సంఘం రాష్ట్ర పిలుపు మేరకు గురువారం భోజన విరామ సమయంలో శ్రీకాకుళం జిల్లా సహకార అధికారి కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ అమరావతి శ్రీకాకుళం అసోసియేట్ చైర్మన్ శ్రీ దామోదర్ రావు, ఏపీ జేఏసీ అమరావతి శ్రీకాకుళం జిల్లా ఉమెన్ వింగ్ జనరల్ సెక్రటరీ శ్రీమతి జి. అరుణకుమారి ఆధ్వర్యంలో ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న డిమాండ్లపై నినాదాలు చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం బకాయిపడిన వివిధ ప్రయోజనాలు, డిమాండ్లను ఇకపై జాప్యం చేయకుండా పరిష్కరించాలని వారు కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపి, సానుకూల వాతావరణంలో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లు ప్రభుత్వ వ్యవస్థలో కీలక భాగస్వాములని, వారి సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రభుత్వంపై మరింత విశ్వాసం పెరుగుతుందని నాయకులు పేర్కొన్నారు. పెండింగ్ డిమాండ్లపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకుని ఉద్యోగులు, పెన్షనర్లకు న్యాయం చేయాలని వారు కోరారు.





## ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పర్యటించనున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

*సెప్టెంబర్ 03 : కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు.. శుక్రవారం నాడు కవిటి మండలం ప్రగడపుట్టుగలో జరిగే కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొనున్నారు. శుక్రవారం నాడు పూర్తిగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలోనే పర్యటించనున్న రామ్మోహన్ నాయుడు.. స్థానిక ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తో కలసి పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, ఎంపి కప్ 2026, కృష్ణాష్టమి వేడుకల్లో భాగస్వామ్యం కానున్నారు.*

*తొలుత ఉదయం 9 గంటలకు కంచిలి మండలం పోలేరులో బిటి రోడ్డు ప్రారంభోత్సవం చేస్తారు. అనంతరం కంచిలి మండలం గుండం గ్రామంలో తెలుగుదేశం పార్టీ లోకి పలువురు చేరికలు అయ్యే కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొంటారు. ఇచ్ఛాపురం రాజా వారి మైదానంలో 2.29కోట్ల కోల్ ఇండియా సి.ఎస్.ఆర్ నిధులతో నిర్మించనున్న బ్యాడ్మింటన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులకు శంకుస్థాపన చేస్తారు.*

*ఇచ్ఛాపురం మున్సిపాల్టీ పరిధిలో రైల్వే అండర్ పాస్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం భైరిపురం, రాజాపురం గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నాం మూడు గంటల నుండి కవిటి మండలం ప్రగడపుట్టుగలో జరగనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి కార్యక్రమాలు, ఎంపి కప్ 2026 లో భాగంగా ఉట్టి కొట్టే పోటీలు, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రామ్మోహన్ నాయుడు భాగస్వామ్యం అవుతారు.*

# ముప్పుల మధ్యా.. ప్రజల పక్షమే!

*మాల్కన్‌గిరి మట్టిలో మూడు దశాబ్దాల సాహస జర్నలిజం*

*మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలోనూ వెనకడుగు వేయని కలం*

*గిరిజనుల సమస్యలకు గొంతుకగా.. సామాజిక సేవలోనూ ముందడుగు*

*సీనియర్ జర్నలిస్ట్ గోపీ కృష్ణ పట్నాయక్‌ను సత్కరించిన యూజేఎఫ్ నేతలు*

నవతరం మధురవాడ: సాహసమే ఊపిరిగా.. సమాజ హితమే లక్ష్యంగా మూడు దశాబ్దాలుగా మాల్కన్‌గిరి ప్రాంతంలో జర్నలిజం కొనసాగిస్తున్న సీనియర్ జర్నలిస్ట్ డి. గోపీ కృష్ణ పట్నాయక్‌ను ఉత్తరాంధ్ర జర్నలిస్ట్స్ ఫ్రంట్ (యూజేఎఫ్) అధ్యక్షులు డా. ఎం.ఆర్.ఎన్. వర్మ, సమన్వయకర్త డి. హరనాథ్ బుధవారం ఉదయం మధురవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించి యూజేఎఫ్ హ్యాండ్‌బుక్‌ను అందజేశారు. యూజేఎఫ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను తెలుసుకున్న గోపీ కృష్ణ పట్నాయక్.. సామాజిక దృక్పథంతో జర్నలిస్టులు సేవలందించడం అభినందనీయమన్నారు. జర్నలిజం కేవలం వార్తలు రాయడానికే పరిమితం కాకుండా ప్రజల సమస్యలకు స్వరం కల్పించే సాధనంగా ఉండాలని అభిప్రాయపడ్డారు.

### ముప్పుల మధ్యా.. వెనకడుగు వేయని కలం

గత 30 ఏళ్లుగా మాల్కన్‌గిరి ప్రాంతంలో జర్నలిస్టుగా పనిచేస్తున్న గోపీ కృష్ణ పట్నాయక్ గతంలో ‘సంబాద్’, ‘ఈనాడు’, ‘ఈటీవీ’ తదితర మీడియా సంస్థలతో పనిచేశారు. ప్రస్తుతం ఒడిశాలోని ప్రముఖ దినపత్రిక ‘సమాజ్’కు మాల్కన్‌గిరి జిల్లా ప్రతినిధిగా సేవలందిస్తున్నారు. ఒకప్పుడు మావోయిస్టు కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్న మాల్కన్‌గిరిలో కాల్పులు, దాడులు, కిడ్నాప్‌లు, బంద్‌లు, మందుపాతర పేలుళ్ల వంటి ప్రతికూల పరిస్థితుల మధ్య కూడా ప్రజల సమస్యలు, భద్రతా పరిస్థితులు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం వార్తలుగా అందించారు. మావోయిస్టు ఉద్యమానికి సంబంధించిన పలు కీలక పరిణామాలను ప్రత్యక్షంగా కవర్ చేసిన అనుభవం ఆయనకు ఉంది. మావోయిస్టు అగ్రనేతలుగా పేరొందిన గణపతి, కిషన్‌జీ, ఆర్.కె. తదితరులతో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు.

### కలెక్టర్ కిడ్నాప్ ఘటనలోనూ కీలక అనుభవం

మాల్కన్‌గిరి మాజీ కలెక్టర్ వినీల్ కృష్ణను మావోయిస్టులు కిడ్నాప్ చేసిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సమయంలోనూ తన వంతు పాత్ర పోషించానని గోపీ కృష్ణ పట్నాయక్ తెలిపారు. కలెక్టర్ సురక్షితంగా విడుదల కావడానికి జరిగిన ప్రయత్నాల్లో తాను భాగస్వామ్యమైనట్లు పేర్కొన్నారు. మావోయిస్టుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన భద్రతా సిబ్బంది, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ గ్రేహౌండ్స్ సిబ్బందికి సంబంధించిన పలు ఘటనలను కూడా కవర్ చేసినట్లు వివరించారు.



### గిరిజనుల గొంతుకగా.. సేవా బాటలో

ఒకప్పుడు మావోయిస్టు ప్రభావంతో భయాందోళనలకు గురైన మాల్కన్‌గిరి ప్రస్తుతం శాంతి, అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందని గోపీ కృష్ణ పట్నాయక్ అన్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లోని ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, వారి గొంతుకగా నిలవడమే తన జర్నలిజం లక్ష్యమన్నారు. జర్నలిజంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ఆయన భాగస్వామ్యమవుతున్నారు.

ఆరోగ్య శిబిరాల నిర్వహణ, గిరిజన, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, ఆర్థికంగా వెనుకబడిన రోగులకు వైద్య సహాయం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. “జర్నలిజం అంటే కేవలం వార్తలు రాయడం కాదు.. ప్రజల సమస్యలను గుర్తించి, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లడం కూడా జర్నలిస్టు బాధ్యత” అని గోపీ కృష్ణ పట్నాయక్ పేర్కొన్నారు. మూడు దశాబ్దాల తన ప్రయాణంలో మావోయిస్టు ఉద్యమం నుంచి శాంతి, అభివృద్ధి వరకు మాల్కన్‌గిరి మార్పును దగ్గరగా చూశానన్నారు. మాల్కన్‌గిరి వంటి మారుమూల ప్రాంతాల్లో ప్రజల కోసం పనిచేస్తున్న స్థానిక జర్నలిస్టుల సేవలు మరింత గుర్తింపు పొందాల్సిన అవసరం ఉందని యూజేఎఫ్ ప్రతినిధులు పేర్కొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by SIRIGIRI VARADARAJU, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at: Kranthi Publications, D.No.2-504/1 Aditya Nagar Colony, Arasavilli, Srikakulam, Srikakulam Dist. ANDHRA PRADESH STATE - 532 401, Published at : Kranthi Publications, D.No.2-504/1. Srikakulam Dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor: **SIRIGIRI VARADARAJU**, Email: navararamraju@gmail.com, Cell: **9959007255, 8340844777**